

# హాస్య వల్లరి



## నెలనెలా నవ్వుల పండుగ

కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

### కోడి పుంజు

తూర్పుగోదావరి జిల్లాలోని ఓ చిన్న వూరు

ఆ వూళ్ళో మెథడిస్ట్ చర్చ్‌లో కన్ఫెషన్ బాక్స్‌లో కూర్చుని ఉన్నారు ప్రీస్ట్ సెబాస్టియన్. నిత్యం నిర్ణీత సమయంలో ఓ అరగంట పాటు అక్కడ కూర్చుంటాడతను. ఒకటి రెండు రోజులకొకరు వచ్చి తాము చేసిన పాపం చెప్తారు. ఏం చేస్తే ఆ పాపం పోతుందో సెబాస్టియన్ తగిన సలహా ఇస్తాడు. ఆ చర్చి ఆరంభించినప్పటి నించి ఇది ఆనవాయితీగా వస్తోంది. సాధారణంగా భర్తని కొట్టిన భార్య, పక్కతోటలోని కొబ్బరి చెట్లనుంచి కాయలు దొంగిలించిన వారు, సారాయి తాగి పోట్లాటకి దిగిన వాళ్ళు కన్ఫెషన్ బాక్స్ దగ్గరికి వస్తుంటారు.

ఆ రోజు సెబాస్టియన్ కన్ఫెషన్ బాక్స్ లో కూర్చునీ కోర్చోగానే బయటి నించి కోడిపెట్ట రెక్కల చప్పుడు వినిపించింది.

"ఎవరది?" అడిగాడు ఫాదర్ సెబాస్టియన్.

"నమస్కారం ఫాదరూ. నేను మరియమ్మ కొడుకుని `కన్ను పెసను` వచ్చానండయ్యా" వినిపించిందో గొంతు.

"చెప్పు ఏం పాపం చేసావు?" అడిగాడు ఫాదర్ సెబాస్టియన్.

"కోడి పుంజయ్యా..ఉదయం ఒకళ్ళింట్లోంచి దొంగిలించానయ్యా. ఇంటికెళ్ళి కొయ్యబోయే ముందు నాకు పాపం సేస్తున్నాననే బాధేసి, ఇక్కడికి లగెత్తుకొచ్చానయ్యా. కోడి పుంజుని వెంట తెచ్చానయ్యా. దాన్ని నువ్వు తీసేసుకుని నా పాపాన్ని పోగొట్టమని చెప్పడానికి వచ్చానయ్యా.."

"ఊహుఁ.. నేను తీసుకోనా కోడిపుంజుని.."

"తీసుకో ఫాదరూ. తీసుకుని నా పాపం కాయమని బెతిమలాడడానికి పనివేళా ఇక్కడికి వచ్చానయ్యా.."

"నేను తీసుకోనన్నాగా? నీ పాపం పోవాలంటే నువ్వు దాన్ని ఎవరింట్లోంచి దొంగిలించావో ఆ ఇంటాయనకి తిరిగి ఇచ్చెయ్. దాంతో నీ పాపం ప్రక్షాళనమై నువ్వు నరకం నుంచి కాపాడబడతావ్.."

"అక్కడే చిన్న చిక్కొచ్చిందయ్యా. ఆ ఇంటాయన కోడిని తీసుకోనంటున్నాడు.."

కొద్ది క్షణాలు ఆలోచించి చెప్పాడు ఫాదర్.

"అలాగా? నువ్వు చెప్పేది నిజమేనా?"

"నీతోడు ఫాదరూ.."

"సరే! అది నిజమే అయితే నువ్వు దాన్ని నీ కుటుంబం కోసం నీ దగ్గరే ఉంచుకోవచ్చు."

"అలా చేస్తే పాపమేమోనన్న అనుమానం తీర్చుకోడానికి వచ్చానయ్యా.."

"కోడి అసలు యజమాని వద్దన్నాక పాపం లేదు. అందుకు హామీ నాది. వెళ్ళు.."

"సిత్తం.. ధర్మ ప్రభువులు.." కన్ఫెషన్ బాక్స్‌కి మొక్కి మరియమ్మ కొడుకు చంకలో కోడితో వెళ్ళిపోయాడు.

చర్చి మూసేసాక ఆరాత్రి తన ఇంటికి వెళ్ళాడు సెబాస్టియన్.

"ఏమండీ.. ఈ ఉదయం మనకోడి పుంజుని ఎవరో ఎత్తుకెళ్ళారండీ.." అతనికెదురొచ్చిన భార్య చెప్పింది ఆయనతో.

***

## కుర్ర కలాపాలు

యర్రంశెట్టి శాయి

ఇద్దరు అయిదో క్లాసు పిల్లలు స్కూలు కొస్తూనే వాళ్ళ "ప్రథమ చికిత్స" టీచర్ దగ్గరకు పరుగెత్తారు.

"టీచర్ మేము ఇవ్వాళ ఓ అబ్బాయికి చెరువులో మునిగిపోతుంటే రక్షించి 'ఆర్టిఫిషియల్ రెస్పిరేషన్ ' ఇచ్చాం. వాడిని గట్టిగా పట్టుకోలేక చేతులన్నీ నొప్పి పుట్టాయి ఇద్దరికీ.." అన్నారు వాళ్ళు.

"కాని - ఎందుకలా పట్టుకోవడం?"

"లేకపోతే చూడండి టీచర్- మేము ఆర్టిఫిషియల్ రెస్పిరేషన్ ఇవ్వకముందే లేచి పారిపోతున్నాడు వాడు.."

***



"చెడు అలవాట్లు' అనే పాఠం చెప్తూ స్టూడెంట్స్ అందరినీ ప్రశ్నలేస్తోంది టీచరమ్మ.

"యస్..శ్రీకాంత్! నువ్వెప్పుడైనా బ్రాంది విస్కీలు తాగావా?"

"లేదు టీచర్! మాడాడీ తాగకూడదని చెప్పారు!"

"వెరీ గుడ్ ! తండ్రి అంటే అలా ఉండాలి.. మరి అలాంటివి ఎందుకు తాగకూడదో కూడా మీ డాడీ చెప్పారా?" ఉత్సాహంగా అడిగింది టీచర్.

"చెప్పారు టీచర్! ఇద్దరం తాగితే డబ్బు చాలదట.."

***

"రేపు నేనూ - నా కుటుంబం అనే విషయం మీద వ్యాసం రాసుకురండి" అయిదో క్లాసు పిల్లలకి చెప్పింది క్లాసు టీచర్.

శీనుగాడు ఇంటికి రాగానే వ్యాసం మొదలుపెట్టి మధ్యలో అనుమానం వచ్చి వాళ్ళ మమ్మీని పిలిచాడు.

"మమ్మీ! నేనెక్కడినుంచి వచ్చాను?" అనడిగాడు అనుమానంగా.

"దేవుడు తెచ్చిచ్చాడు.." చెప్పిందామె.

"మరి నువ్వెక్కడి నుంచి వచ్చావ్?"

"నన్నూ దేవుడు తెచ్చాడు.."

" మా అమ్మమ్మ,,"

"అమ్మమ్మను కూడా దేవుడే తెచ్చాడు.."

వాడు మారు మాట్లాడకుండా కాంపోజిషన్ రాయటం ప్రారంభించాడు.

" మా కుటుంబంలో మూడు తరాలనుంచీ సహజమైన పుట్టుకలు లేవు.."

***

రామకృష్ణారావ్ ఆఫీసు పనిమీద మద్రాస్ వెళ్ళి పిల్లలకోసమని బర్మా బజార్ లో రెండు రకాలైన జపాన్ బొమ్మలు కొనుక్కొచ్చాడు.

ఇంటికి రాగానే ఆ బొమ్మలు బయటకు తీస్తూ వాళ్ళ బాబి గాడితో -

"ఇదిగో..ఒకటి నీకు , ఒకటి చెల్లాయ్‌కి. నీకేది కావాలి?" అనడిగాడు.

బాబిగాడు ఓ క్షణం ఆలోచించి "చెల్లాయ్ దే నాక్కావాలి" అన్నాడు.

***



ఓ పెద్ద మనిషి రాజారావ్ ఇంటికి ఫోన్ చేసాడు.

"హలో.."అన్నాడు ఓ చిన్నపిల్లాడు ఫోన్‌లో.

"మీ డాడీని పిలువు బాబూ.." అన్నాడా పెద్ద మనిషి.

"డాడి.. మమ్మీ గుడికెళ్ళారు."

"పోనీ ఇంకెవరైనా ఉన్నారా ఇంట్లో..?"

" మా సిస్టర్ వుందండీ..!"

" అయితే ఆమెను మాట్లాడమను!"

పావు గంట తర్వాత కుర్రాడి గొంతు వినిపించింది " అది ఉయ్యాలలోంచి దిగటం లేదండి.."

***

చిన్నిగాడు స్కూల్లో చేరిన మొదటి రోజు అది. హోమ్ బెల్ అవగానే పిల్లలందరూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. కానీ చిన్నిగాడు మాత్రం క్లాసులోనే ఉండిపోయాడు.

" నువ్వు ఇంటికెళ్ళవేం రా చిన్నీ?" అడిగింది టీచర్.

"నాకు పదిహేనేళ్ళు వచ్చేవరకూ స్కూల్లోనే ఉండాలని మా మమ్మీ చెప్పిందండీ.." దిగులుగా అన్నాడు చిన్ని.

***

"మీ కుక్క పేరేంటమ్మా పాపా?"

"తెలీదండీ..ఎన్ని సార్లడిగినా చెప్తేగా అది!?"

***

ఓ పిసినారి రామారావు గారు కొత్తగా రిలీజైన హిచ్‌కాక్ సినిమా చూడ్డానికొచ్చారు. బయట చాలా రష్ గా వుండడం వల్ల ఓ కుర్రాడిని పిలిచి క్యూలో నిలబడి టికెట్ తెచ్చిమ్మని కోరాడు. ఆ కుర్రాడు ఓ రూపాయి సంపాదించవచ్చు కదా అన్న ఆశతో గంటసేపు క్యూలో నిలబడి ఆయనకు టికెట్ తెచ్చి ఇచ్చాడు.

పిసినారి రామారావు ఆ కుర్రాడి చేతిలో పది పైసలు పెట్టి హాల్లోకి వెళ్ళబోయాడు.

ఆ కుర్రాడి వళ్ళు మండిపోయింది. వెంటనే ఆయన వెంబడి పరుగెత్తుకొచ్చి "సార్! ఈ సినిమాలో హంతకుడు ఇంట్లో పనిచేసే నౌఖరే" అని చెప్పేసాడు కసిగా! ***

# చౌ చౌ



స్వామి భోజనానంద తన శిష్యబృందంతో ఒక వూళ్ళో అడుగుపెట్టాడు. భక్తి పేర ప్రజలను మోసం చేస్తున్న అతడి గుట్టు ఎలాగైనా రట్టు చేయాలని బుడుగు అనుకున్నాడు. కానీ స్వామీజీ బుడుగుకి దొరకలేదు. కనీసం ఆయన శిష్యుడ్ని పట్టుకుంటే ఏదయినా తెలుసుకోవచ్చని ప్లాన్ వేశాడు.

" మీ గురువుగారికి వెయ్యి సంవత్సరాలని చెబుతున్నారు..నిజమేనా" అడిగాడు బుడుగు.

"ఏమోనండి.. ఏను వచ్చి నాలుగొందల సంవత్సరాలే అయింది.." అంటూ వెళ్ళిపోయాడా శిష్యుడు.

***

"ఏవండీ..ఈ రోజు ఆఫీసు నుంచి త్వరగా వచ్చేస్తారు కదా.." జంబులింగం భార్య జంబులింగంతో గోముగా అంది.

" సినిమాకేనా త్వరగా వచ్చేస్తాన్లే.." అన్నాడు జంబులింగం.

"అదేనండీ..నేనూ పక్కింటి పిన్నిగారూ కల్సి వెళుతున్నాం. మీరు ఇంట్లో ఉంటారనీ.."

***

"హలో.. ఇది ..2456897 నంబరేనాండీ.."

"రాంగ్ నంబర్..ఇది 2456896.."

"అలాగా..అయితే ఒక సారి మీ పక్కింటాయనకి ఫోన్ ఇస్తారా?"

***

పరమానందయ్య గారు క్లాసులో డిక్టేషన్ చెబుతున్నారు.

చివరి బెంచీలో ఉన్న బుడుగు " వినిపించడం లేదు సార్.." అన్నాడు.

"సరే ..అయితే బోర్డు మీద రాస్తాన్లే.." అంటూ బోర్డుకేసి నడిచాడు పరమానందయ్య.

***

"ఆ డాక్టరు నీ జీవితాన్ని కాపాడేడా..ఎలా?"

" ఆ మధ్య నాకు జబ్బు చేస్తే మా వాళ్ళు ఆయన కోసం కబురు పంపేరు. ఆయన రాలేదు.."

***

"మగాళ్ళు కంటే ఆడాళ్ళే ఎక్కువ కాలం బ్రతకడానికి కారణం ఏమిటంటావ్?"

" ఆ ఏముందీ.. వాళ్ళకి భార్యలు ఉండరుగా.."

***

"ఏమేవ్.. మీ అయన ఆడపిల్లల వెంట పడుతున్నాడంట.."

"ఏం ఫరవాలేదు.. కుక్కలు కార్ల వెంట పరిగెత్తినంత మాత్రాన కారుని నడపలేవు కదా.."

***

"మమ్మీ మేము జూలో ఏనుగుల్లా ఆడుకుంటున్నాం..మాకు నువ్వు సహాయం చెయ్యగలవా?" అడిగారు పిల్లలు.

"అలాగే..ఇంతకూ నేనేం చెయ్యాలి?" అడిగింది తల్లి.

"నువ్వు 'జూ' చూడడానికి వచ్చావన్నమాట.. మేం తినేవన్నీ నువ్వు పెడతావన్నమాట..సరేనా?" ఒకేసారి అన్నారిద్దరూ.

***

"వర్షం ఎందుకు కురుస్తుంది నాన్నా..?"

"గడ్డి పెరగడానికి..పువ్వులు పుయ్యడానికి.."

"బాగానే ఉంది.. మరైతే మనం నడిచే దారిలో ఎందుకు కురుస్తుంది?"

***

